# తలరాత !

ప్రముఖలాయరు రాఘవరావు వృద్ధాశ్రమంలో చేరాడనే విషయం ముకుందరావుకి తెలీటంతో వెళ్లి వకసారి చూచి పరామర్శించి రావాలన్పించింది!

ఆ రోజు ఆదివారం కావటం వల్ల సాయంత్రం నాలుగు గంటలకల్లా ముకుందరావు వృద్ధాశ్రమానికి బయలుదేరాడు.

ముకుందరావు సీనియర్ సిటిజన్! అరవై ఐదు దాటిన వయసు. రిటైరవగావచ్చిన డబ్బుతో సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ కొనుక్కుని... మిగతా డబ్బు వివిధ స్కీముల్లో జాగ్రత్తగా దాచుకున్నాడు.

మొదటి నుండి ముకుందరావుకు డబ్బు విషయాల్లో కాస్తంత జాగర్త ఎక్కువనే చెప్పాలి! దండుగ ఖర్చులు ససేమిరా పెట్టడు. దుబారా అంటే గిట్టని మనిషి!

నలుగురుపిల్లలు పుట్టినా పసితనంలోనే కళ్లు మూసారు. శ్రీమతికి ఆపరేషన్ చేయించి గర్భసంచీ తీసేయించటంతో తనకిక సంతాన యోగం వుండబోదని తీర్మానించుకున్నాడు.

పుట్టిన పిల్లలు బతక్కపోవటంతో మనసు బాధకు గురైనా... తల్లిదండ్రులనువృద్ధాప్యంలో నిర్లక్ష్యానికి నిరాదరణకు గురిచేయబడటం కళ్లారా చూస్తూ.... తనకు బిడ్డలు లేక పోవటమే మంచి దన్పించింది.

తనకు పిల్లల్లేరనే దిగులుగాని... చింతగానీ లేశమంతైనా లేదు. అనాధ ఆశ్రమం నుండి ఒక మగు నలుసును తెచ్చుకుని పెంచుకోమని ఇటు బంధువర్గం.. అటు మిత్రులు పోరినా... తను మాత్రం ఆపని చేయతలచుకోలేదు.

ముక్కూముఖం తెలీనీ అనాధ శిశువుని తెచ్చి పెంచుకుని పెద్దచేస్తే... వాడైనా సక్రమంగా తమరిని వృద్ధావ్యంలో ఆదుకుంటాడనే నమ్మకం ఏముంటుందన్పించింది. వాడెలాంటివాడవుతాడో? చచ్చేక తలకొరివి అయినా పెడతాడో లేదో? అదీ నమ్మకం లేదు. తనకు మనశ్శాంతి కరవౌతుంది. తానెప్పుడు కన్నుముస్తానా... ఎప్పుడు తన కున్న ఆస్తి డబ్బు అతని పరమౌతుందానే ఆలోచనే తప్పించి పెంచిన వారి మీద మమత వుండక పోవచ్చు. అలాంటప్పుడు కోరి కొరివిని తెచ్చి నెత్తిన పెట్టుకోవటం దేనికి? అన్పించింది.

మమతలు...అనురాగాలు... అప్యాయతలుకొరవడిన రోజులివి. వయస్సుమీద పడిన తల్లిదండ్రులను చూడాలంటేనే చిరాకు పడిపోతున్నారు. ఎందుకొచ్చిన తద్దినంరాదేవుడాని...

కోడళ్లు తమతో అత్తమామలను వుంచుకుని ఇంత తిండిపెట్టేందుకు ఏడుస్తున్నారు.

ఆకారణంగానే.. కుప్పలు తెప్పలుగా వృద్ధాశ్రమాలు వెలుస్తున్నాయ్! అక్కడా చాలాచోట్ల పరిస్థితులు సరిగ్గా వుండటం లేదు. వ్యాపారధోరణితో ధనార్జనకొరకే అవిర్భవించినవే అన్పిస్తోంది. మానవతా దృక్పథంతో వృద్ధులకు మనసా వాచా సేవచేయాలనే తలంపు మృగ్యమౌతోంది.

తన సంగతి ఇలా వుంటే... ఇక తన ప్రాణమిత్రుడైన రాఘవరావు సంగతి వేరే చెప్పనక్కర్లేదు. సంతానయోగం ఆయన ముఖాన రాసిపెట్టిలేదు. ఆ దేవుడు దానికి తోడు పులిమీద పుట్రలా పాతికేల్లనాడే భార్య కాలం చేయటంతో ఆయనదీ ఒంటరి బ్రతుకైంది.

తరతరాలుగా సంక్రమించిన ఆస్థిమాటలా వుంచితే లాయరు వృత్తిలో రెండు చేతులా ఆర్జించాడు.సిటీ నడిబొడ్డున లక్షణమైన బంగళా! ఇంట నౌకర్లు. తోటమాలి.. వంటమనిషీను!.

భార్య బతికివున్న రోజులలో సంతాన ప్రాప్తి కోసం తీర్థ యాత్రలు చేసాడు. మొక్కని దేవుడు లేడు. చేయని పూజలేదు. దాన ధర్మాలకూ పెట్టింది పేరు రాఘవరావు.

రాఘవరావులో దయాగుణం పాలెక్కువ. బీద వారని తెలిస్తే దమ్మిడీ ఫీజులేకుండా కేసు టేకప్ చేసి గెలిపించి పెడతాడు. డబ్బున్న వారి కేసులైతే ఎక్కువ మొత్తంలో చెవులు పిండి మరీ వసూలుచేస్తాడు.

రాఘవరావు కోర్టులో కేసు వాదిస్తుంటే న్యాయ దేవత సైతం హడలిపోతుంది. న్యాయమూర్తుల కళ్లు తిరుగుతయ్. తోటి అప్పొజిషన్ లాయర్లను ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగిస్తాడు. కేసు టేకప్ చేశాక ఓటమి ఎరుగని లాయరు రాఘువరావు.

భార్య చనిపోక ముందు... తమకు సంతాన యోగం లేదని తీర్మానించుకున్నాక... ఇంట్లో పని చేసే ఆడ మనిషి యాదమ్మ కొడుకుని చూచి ముచ్చటపడి... ఆ పసికందును పెంచుకోవాలనే ఆలోచన కలిగి... ఆ మాటే రాఘవరావు చెవినవేసింది! వెయ్యటమేకాదు తన ప్రతిపాదన వప్పుకు తీరాల్సిందేనంటూ ఆమె భర్త చెవిలో జోరీగలా రొదపెట్టింది.

అదికాదే అది మనంటి పనిమనిషి. దాని మొగుడు రిక్షా లాగుతాడు. వారికి పుట్టిన బిడ్డని ఎలా పెంచుకుంటామే? వాడిదేకులమో.. గోత్రమో? అంతగా కావాలంటే మనం ఏ అనాథాశ్రమానికో వెళ్లి ఓ మంచి పసివాడిని తెచ్చుకు పెంచుకుందాం. భార్య హైమవతికి నచ్చజెప్పబోయాడు.

'మీకసలు ఏమీ తెలీదు. దీని బిడ్డలైతే.... తల్లిపాలు ఆ పసివాడికి వుంటాయ్! కులగోత్రం మాట మర్చిపోండి. పిల్లవాడు ఎర్రగా బొద్దుగా ఎంతముద్దొస్తున్నాడో చూడండి... వాడి ముఖాన రాజకళ వుట్టిపడుతున్నదంటే నమ్మండి.

అపు ఇక నీవుపన్యాసం. అథవా.... మనం పెంచుకోవాలనుకున్నా.... యాదమ్మ దాని మొగుడు తమ బిడ్డని మనం పెచుకుంటామంటేఇవ్వద్దూ. వారు ఒప్పుకోకుంటే?.

'నాకామాత్రం తెలీదా ఏం? దానికి అరడజను మంది సంతానం!వాళ్లని పోషించలేక నానాయాతన పడుతున్నట్టు యాదమ్మ చెప్పి కళ్లనీళ్లు పెట్టుకుంది చాలాసార్లు!

'ఇంకేం నీ మనసు నవనీతంలా కరిగిపోయి వుంటుంది. వెటకారంగా అన్నాడు రాఘవరావు.

'మీరు నవనీతమనండి... ఐస్‌ఫ్రూట్ అనండి. సంతానం లేక తల్లడిల్లిపోతున్న నాకు యాదమ్మ కొడుకును పెంచుకోవటంలో ఆనందం... తృప్తీ వుంటాయన్పించింది. మరోవైపు.. దానికి సాయపడ్డట్టూ.. వుంటుందన్పించింది. నా మనసులో మాట దానితో చెప్పాను. మొదట్లో కాదని అన్నా... తర్వాత ముగుడు పెళ్లాం ఏం ఆలోచించుకున్నారో ఏమోగాని... మొత్తానికి యాదమ్మ మెత్తపడింది...

'ఓసినీ! నా వెనుక...నాకు తెలీకుండా..ఇంత భాగవతం నడిపావన్నమాట. అయితే ఇంకా లేటు దేనికి? దాని ముఖాన కావలసిన డబ్బు విసిరేసి... సిద్ధాంతిగారితో ప్రస్తావించి... పురోహితుల వారిని పిలిపించి ముహూర్తం పెట్టించి... యాదమ్మ కొడుకును దత్తత చేసుకుందాం. అనేసి భార్య ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు రాఘవరావు.

పోయిపోయి పని మనిషి కొడుకును పెంచుకునే స్థితికి దిగజారేరా?... అని బంధువులంతా కాకుల్లా పొడిచారు రాఘవరావు దంపతులను.

అయినా లక్ష్యపెట్టక... యాదమ్మ కొడుకుని దత్తత చేసుకుని సంతోషించారు! మురిసారు!

ఏడాది తిరక్కుండానే యాదమ్మ మొగుడు తాగి రాత్రి సమయంలో రిక్షా తొక్కుతూ స్పీడుగ వచ్చిన లారీ గుద్దేయటంతో మృత్యువాత పడ్డాడనే విషయం రాఘవరావు దంపతులను కలచివేసింది. డబ్బుసాయం చేసి ఆదుకున్నారు!

రాఘవరావు పెంపుడుకొడుకు అక్షరాభ్యాస కార్యక్రమం పెద్ద ఎత్తున ఘనంగా జరిగింది. ఆ రోజు పేదలకు అన్నదాన కార్యక్రమం జరిగింది. వేదపండితులను సత్కరించి సంభావనలు... నూతన వస్త్రాలు ముట్టచెప్పటమూ జరిగింది.

ఇది జరిగి ఆరునెలలైనా కాకుండానే తన ఒక్క దాని రెక్కల కష్టంతో అయిదుగురు పిల్లలనూ పోషించలేక అన్నంలో విషం కలిపి పిల్లలందరికీ పెట్టి తానూ తినేసింది యాదమ్మ.

హృదయవిదారక సంఘటన రాఘవరావు దంపతులను కలచివేసింది. అన్నీ తానే అయి రాఘవరావు మనుష్యులను పిలిపించి దహనసంస్కారాది కార్యక్రమాలను చేయించి పుణ్యం కట్టుకున్నాడు.

తాము ముద్దుగా పెంచుకుంటున్న మగ పిల్లవాడు రమేష్ మీదే ఆశలన్నీ పెట్టుకు రోజులు గడుపుతున్నారు దంపతులిద్దరూ.

రమేశ్ కాలేజీ చదువుకొచ్చేనాటికి భార్య ఆకస్మికంగా మరణం కృంగదీసింది రాఘవరావుని!

భార్య కాలంచేసిందనే బాధతో కోర్టుకి వెళ్లటం మానేశాడు. న్యాయవాదవృత్తికి తిలోదకాలిచ్చాడు.

దీనికి తోడు... రమేష్ చదువు పట్ల శ్రద్ధ చూపక పోవటం, జులాయి వెధవలతో స్నేహం చేసి ఇల్లు పట్టకుండా తిరగటం... రాఘవరావుని మరింత కలచివేసింది.

డిగ్రీ పూర్తి చేయటం ఇష్టం లేదని.. వ్యాపారంచేయాలని వున్నదని పోరుపెట్టడంతో అయిష్టంగానే అడిగినంత డబ్బు కొడుకు పరం చేయక తప్పలేదు రాఘవరావు.

రమేష్ టెంపర్‌మెంట్ ఎలాంటిదో తనకు తెలియనిది కాదు. అలాంటి వాడు వ్యాపారంలో మాత్రం వృద్ధిలోకొస్తాడనే నమ్మకం ఏకాశానా రాఘవరావుకు లేదు. అయినా పెంచిన మమకారంతో..కొడుకనే వాత్సల్యంతో ఏది అడిగినా 'నో' అన్లేక పోతున్నాడు.

పోనీ వివాహం చేస్తే నైనా మనిషి బాగుపడతాడేమో అన్పించటంతో రమేష్‌తో పెళ్లి విషయం ప్రస్తావించాడు. అందుకు ససేమిరా అన్నాడు రమేష్.

చెప్పిన మాట చెవిన వేసుకోకుండా మొండిగా రమేష్ ప్రవర్తించటం...మానసిక వేదనకు గురిచేసింది.

గతాన్ని నెమరు వేసుకుంటూ ముకుందరావు వృద్ధాశ్రమాన్ని చేరుకున్నాడు.

రాఘవరావు ఏ రూమ్‌లో వుంటున్నదీ మేనేజర్‌ని అడిగి తెలుసుకున్నాడు ముకుందరావు అటుకేసి నడిచాడు.

గదిలో బెడ్‌మీద కళ్లుమూసుకుని పడుకున్న రాఘవరావుని చూచేసరికి ముకుందరావు హృదయం ద్రవించింది! కళ్లు చమర్చినయ్!

అలికిడికి కళ్లు తెరిచి తలపక్కకు తిప్పి లేచి కూర్చోబోతూ రావోయ్ ముంకుందం అన్నాడు.

'నిన్ను చూద్దామనే పనిగట్టుకుని వాచ్చను. అక్కడున్న చైర్లో కూర్చుంటు అన్నాడు ముకుందరావు.

'కాఫీ తెప్పించి ఇవ్వటానికై నా ఇక్కడ వీలుండదు ముకుందం. గెస్ట్ ఛార్జస్ ఇస్తామన్నా ఒబ్లైజ్ చెయ్యరు. ఇది ఆశ్రమం కదా! ఏదైనా టైమ్ ప్రకారమ్ ఇక్కడ. మంచం మీద నుంచి లేచి ముకుందరావు పక్కగ వున్న మరో ఛైర్లో కూర్చున్నాడు రాఘవరావు.

'ఇదేం ఖర్మరా రాఘవా నీకు? ఆనందంగ పదిమంది నౌకర్లను... వంట వారిని పెట్టుకుని స్వంత బంగళాలో...వుండక.. ఇతరుల దయాభిక్ష మీద ఆధారపడి బతకాల్సిన అవసరం నీకేమొచ్చి ఇక్కడ చేరావు చెప్పు.

'ఒరే ముకుందం... జీవితంలో ఎత్తు పల్లాలు చూశాను. కష్ట సుఖాలు అనుభవించాను... నా వంటి దురదృష్టవంతుడికి ఆఖరి మెట్టు ఇదే. రాఘవరావు నిట్టూర్చాడు.

'భార్య ఎలాగూ లేదుసరే.... చెట్టంత కొడుకుని పెట్టుకుని నీకు ఇక్కడ దిక్కుమొక్కులేని చోట వుండవలసిన ఖర్మం వచ్చిందీ అని?-పిల్లవాడికి పెళ్లి చేసి... హాయిగా కోడలు ఇంటికొస్తే... నిన్ను పువ్వుల్లో పెట్టి మహారాజులా చూసుకునేది కదా..?

'అంతటి అదృష్ఠం నా ముఖాన రాయలేదురా... ఆ దేవుడు... 'నిట్టూర్చాడు రాఘవరావు.

'ఇప్పుడు నీ కేం తక్కువనీ?

'అదృష్టమొక్కటే తక్కువ! ఈ వయసులో సుఖపడేరాత ఆ భగవంతుడు నా ముఖాన రాయలేదంతే...

'నీ ధోరణి నాకేం అర్థం కావటం లేదు..కాస్త వివరంగా చెప్పు.

'నా కొడుకున్నాడే రమేష్! డబ్బు కావాలంటూ నన్ను పీక్కుతినని క్షణం లేదు. బాధ్యత తెలియని ఫూల్ వాడు. బ్రాందీ షాపుపెట్టి.. చెడు సావాసాలకు మరిగి పోలీసులతో ఘర్షణ పడి... తన్నులు తిని... జైలుకెళ్లి...ఇలా ఎన్నిని చెప్పన్రా ముకుందం? - వాడిని పెంపుడు తీసుకుని... కొరివితో తల గొక్కున్నట్టయ్యింది. గారాబంగా పెంచామా?!.... వాడిలో క్రమశిక్షణ లేకుండా పోయింది. ఏకు మైకే నాడు. వాడి తండ్రి నీచపు బుద్ధులే వాడికీ అబ్బినయ్. లో క్లాస్ వాడికి పుట్టినవాడు కదా? మహారాజు ఇంటపెరిగినా తండ్రి గుణాలు పోకుండా అబ్బినయ్-అంతా వాడి ఖర్మ నాతల రాత!!

'నిన్ను ఇట్లొంచి బైటికి వెళ్లి పొమ్మని గెంటేశాడా ఏం?-సాను భూతి ప్రకటిస్తూ మాట్లాడేడు ముకుందరావు.

'అసలేంజరిగిందో చెప్పరా? - సమయానికి నేను వూళ్లో లేకుండా తీర్థయాత్రల పేరుతో దేశం తిరిగొస్తిని! నాలుగు నెలలు మనంకలుసుకో పోయే సరికి ఎన్నెన్ని అనర్థాలు సంభవించాయో చూడు" బాధపడ్డాడు ముకుందరావు.

'నువ్వుండి చేయగలిగిందేమీ లేదురా...'

'అసలేంజరిగిందో కాస్తంత శాంత పడి చెప్పరా.'

'నీకు కాకపోతే మరెవరితో చెప్పుకుని నాగుండె మీది బరువు దించుకోగలను చెప్పు?... రమేష్ హత్య కేసులో ఇరుక్కుని జైలుపాలయ్యాడు. వాడిని బెయిలు మీద బైటికి తీసుకువచ్చి

వాడి తరపున కేసు వాదించి గెలవాలన్పించక పోయినందువల్లే... ఈనాడు నేనిక్కడికి వచ్చి చేరాను..! చెప్తున్నవాడల్లా ఆగి కళ్లొత్తుకున్నాడు రాఘవరావు.

'బాధపడకు!-నీవంటి వాడికి రావలసిన కష్టాలా ఇవి?

'వాడు నడిపే బ్రాందీషాపులోనే కొంతమంది తాగుతూ వచ్చారు. షాపులో తాగవద్దని రమేష్ వాళ్లని వారించకపోగా..వారితో కల్సి తానూ తాగడంతో విషయం పోలీసుల దాకా వెళ్ళింది. మామూళ్లిచ్చి వాళ్ల నోళ్లు ఎలాగో మూయిస్తూ వచ్చాడు. కానీ.. అన్నీ రోజులు మనవి కాదు కదా?- పాత ఎస్సై ట్రాన్స్ఫరై... ఆ పోలీస్ స్టేషన్‌కి కొత్త ఎస్సై వచ్చాడు. అతను చాలా స్ట్రిక్ట్! షాపును బార్‌గా మార్చాడన్న నేరంతో రమేష్ చేతులకు బేడీలు వేసి పోలీస్ స్టేషన్‌కి లాక్కెళ్ల బోయాడు ఆ కొత్తగా వచ్చిన స్ట్రిక్ట్ ఎస్సై! ఎస్సైకి లొంగని రమేష్..ఎదురు తిరిగాడు... అతనితో పెనుగులాడాడు. అతని బెల్టుకి గల రివాల్వర్ తీసి ఎవ్వరూ వూహించని రీతిలో... ఆ కోపంలో ఎస్సైని కాల్చి చంపాడు. ఆ వున్మాదస్థితిలో తాను ఏం చేస్తున్నాడో కూడా తెల్సుకోలేని రమేష్‌ని వెంట వున్న కానిస్టేబుల్ లొంగ దీసుకుని జీపులో ఎక్కించుకుని సెల్‌లో పెట్టి కేసుబనాయంచాడు. ఆవేశంతో చెప్తూ ఆగేడు.

'ఆ తర్వాత ఏమైంది?'

'ఏ మౌతుంది! నాకున్న పరువు ప్రతిష్టలు మంట గలిసినయ్! ఆదుర్మార్గుడి ముఖం కూడాచూడాలన్పించలేదునాకు. వాడి తలరాత ఎలావుంటే అలా జరుగుతుందని వాడి గురించి పట్టించుకోలేదు. వాడికెట్లాగూ ఉరిశిక్ష తప్పదు. డ్యూటీలో వున్న ఎస్సైని కాల్చి చంపడం ఎంత ఘోరం? నేరం? అటువంటి రాక్షసుడు నాకొడుకే కాదనుకున్నాను! చూశావా ముకుందరావు... దారిన పోయే దాన్ని నెత్తికి రాసుకోవటమంటే ఇదే కదూ?!-పిల్లల్లేకుంటే పోయె. యాదమ్మ...అదే మా పనిమనిషి మీద జాలిపడి ఆమె బిడ్డను పెంచుకున్నందుకు...నాకు శాస్తి ఇలా జరగవలసిందే..పుణ్యానికి పోతేపాపం ఎదురవటం అంటారే...ఇదేరా! అందుకే..నా తలరాతను భగవంతుడిలారాశాడు. కొడుకు తలరాత అలారాసాడు'. పసివాడిలా వలావలా ఏడ్చాడు రాఘవరావు.

ముకుందరావుకి నోట మాట కరువైంది!

-:(సమాప్తం):-